# బారికోడు

వేసవి ప్రవేశించిన మాసం. అమావాస్య రాత్రులు. ఇళ్ళల్లో బుడ్డీదీపాలు.. చీకట్లను చీలుస్తున్నాయి. వీధుల్లో మాత్రం నల్లని తెరలా చీకటి!

రాత్రి భోజనాల వేళ, ఆ పల్లెలో రాత్రి కరెంటు కోత వేళ అంటే సులువుగా బోధపడుతుంది.

ఆవేళప్పుడు చీకటిలోనే రాజమార్గంలో తిరిగేట్లుగా కుక్కలు. నిష్పూచీగా వీధుల్లో తిరుగుతున్నాయి.

కుడిచేతి లోని దుడ్డుగర్రతో కుక్కలను అదిలిస్తూ ఎడమ అరచేయి మీద - అన్నం తపేళా పెట్టుకొని తిరుగుతున్నాడు బారికోడు.

" అమ్మా ! బారికోడ్ని".

"తిళ్ళవలేదురా,మళ్ళా.. రా "

"చెయ్యి వొల్లకాదు, నడురా బారికోడా "

బారిక ఆదెయ్య ... ఖాళీ తపేళాతో గడప గడపా అడుక్కుంటున్నాడు.

" కరెంటొచ్చిందాక ఆగలేవేట్రా ? చీకట్ల యెవల్ని ముట్టుకుంటావో? " కంసాలి బ్రహ్మయ్య భార్య బారికోడి తపేళాలో పిడికెడు అన్నం ముద్ద వేస్తూ విసుక్కుంది.

బారికోడు చిన్నగా నవ్వాడు. శంకరునికి యెదురైన పంచముడిలా- నన్ను ముట్టుకుంటారా- నా ఆత్మనా ? అనలేదు. ఆమె విసుగుదలను చనువుగా తోసేస్తూ-

"వొసేటమ్మా! కరెంటు లేదని యేటాగిపోయింది? బ్రెమ్మంగోరి భోజనం ఆగిపోనాదా ? నీ ఫలారం ఆగిపోనాదా ? బారికోడు ఆగిపోవాలా ? నేనాగిపోతే, నా ఆకలి ఆగిపోతాదా ? నా పెళ్ళం బిడ్డల ఆకలి ఆగిపోద్దా ?" అని బదులు ప్రశ్నలు వేశాడు.

కంసాలి బ్రహ్మయ్య లౌక్యం ఎరిగినోడు. గవర్నమెంటు బారికోడు యే సమయంలో యే అవసరంకి పనికొస్తాడో చెప్పలేం అన్న గ్రహింపుతో బారికోడికి సపోర్టుగా-

"కాలం యింత మారిపోయినా - కంసాలి బ్రెహ్మయ్య పెళ్ళం యింకా యెనకటి కాలం లే వుంటందిరా. చెప్పరా బారికోడా ! బతుకెలాగ గడిచిపోయినా, చచ్చినర్వాత నువ్వు ముడితే గాని దీని కట్టె బుగ్గవదని చెప్పురా .." అన్నాడు బ్రహ్మయ్య.

బారికోడు బ్రహ్మయ్యకు బదులివ్వలేదు.

బ్రహ్మయ్య సానుభూతి గొంతుతో-

"అవునొరే, ఆదియ్యా? నీ పెళ్ళంకెలాగుందిరా?మనుషుల్లో కలుస్తందా? పిల్లాపాప .. అంటోందా ? ఇల్లూ చూస్తందా ? " అనడిగాడు.

ఆదెయ్య వో క్షణం మాట్లాడలేకపోయాడు.

ఇల్లూ, పిల్లలూ, యిల్లాలు ... యెవరు యెవర్ని చూడగలరు ? ఏదీ .. తన చేతుల్లో లేదు .. ఈ అడుక్కునే అన్నం తోపేళా తప్ప ! బ్రహ్మయ్య ప్రశ్న అదెయ్య మనో తటాకంలో రాయిని విసిరినట్లైంది.

ఆదెయ్యకు ఇద్దరు ఆడకూతుళ్ళు సంతానం. మరి సంతానం కనడానికి వొల్లగాదని, ఎమర్జన్సీ రోజుల్ల - ఆదెయ్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు.

పెద్దకూతుర్ని ఎనిమిదేళ్ళ కిందట వొన్నాం బారికి గవరడి కొడుక్కి ఇచ్చి పెళ్ళిచేశాడు. ఆ సంబంధం వొద్దన్నాది ఆదియ్య భార్య. తన అన్న కొడుకు సివినిలో వున్నాడు. చర్మాల వ్యాపారం. మంచోడు, కన్నోరింటి సంబంధం అని ఆశపడింది. గానీ ఆదెయ్య అందుకు ఒప్పుకొలేదు. అన్నీ దగ్గర సంబంధాలేనా ? అట్నించిటూ, ఇట్నించటూ .. యిచ్చు కోడమేనా ? పెద్దపిల్లకి మాత్రం పెడ సంబంధం చేస్తానని పట్టు బట్టి చేశాడు.

పెద్దకూతురు .. పెళ్ళయి.. వొక బిడ్డ తల్లి అయ్యింది. కాపురం బాగానే సాగుతోంది అనుకుంటుంటే.. ఉరుములేని పిడుగు పడింది. వంటసారా వ్యాపారం చేస్తున్నాడని, పెద్దకూతురు భర్తని పోలీసులు అరెస్టు చేసి పట్టుకుపోయారు.

అపుడు బారికోడు తెలిసిన పెద్దల కాళ్ళూ, చేతులూ పట్టుకున్నాడు అల్లుడి విడుదల కోసం.

అల్లుడి శవాన్ని విడుదల చేశారు పోలీసులు. పరువు పోయిందని లాకప్పుల లుంగీ పంచె తోటి ఉరేసుకున్నాడట !

బొట్టూ కాటుక చెరిగిపోయిన కూతుర్ని ఇంటికి తీసుకురాడానికి వెళ్లింది బారికోడి భార్య. కానీ, కూతురు అత్తవారింటినే కోరుకుంది. ఏడాది తిరక్కముందే మరిది రెక్కపట్టుకున్నాడట.

కులానికి తప్పు గట్టలేదని కూతురితో సంబంధాలు తెగతెంపు చేసుకోమన్నారు కులపెద్దలు. పెద్దకూతురు .. అలా దూరమైంది. అపుడే .. బారికోడి భార్య .. సగం చచ్చిన మనిషైంది.

ఆ తర్వాత దెబ్బకు భార్య మానసిక స్థితి ...ఆదెయ్య మరి ఆలోచించలేకపోయాడు.

బ్రహ్మయ్య గారి వద్ద సెలవు తీసుకున్నాడు. ఆ ప్రక్క ఇంటికి వెళ్ళాడు. అక్కడినుంచి, కాపు వీధిలోకి అడుగుపెట్టాడు అపుడే భోజనం ముగించి. వీధివాకిట్లో నులకమంచమ్మీద తీరుబడిగా చేరబడిన యడ్లపోతినాయుడు లేచి, కూర్చుని-

" గంటల లారీ (ఫైర్ ఇంజన్) లాగ ముందు పద్యం, రాగమొచ్చేది - యెనకాల మీ నాయిన వొచ్చీవోడు. నువ్వేట్రా, వొక పజ్జెం లేదు, వొక పాటాలేదు. అడుక్కునోడిలాగ - అమ్మా అనరుస్తావు". అని యిగటమాడేడు.

యడ్ల పోతినాయుడు ... యెవరితోనైనా హాస్యమాడుతాడు. బారిక ఆదెయ్య తండ్రి తరం నాటి మనిషి. తన తాత్తండ్రుల భోగట్టాలు పోతినాయుడు వద్దనే యెక్కువగా విని తెలుసుకున్నాడు ఆదెయ్య. తన తాత పేరు గూడా ఆదెయ్యేనట. చెయ్యెత్తు జమానట. గంపడు వేరుశనక్కాయలు గంటలోన వొలుసుకుతినీసీవోడట. తిండెలాగో పనీ అలాగేనట. నలుగురు మనుషుల సాటి ఆట. ఒకసారి బరువు బండి యేటి బాడువా బురదల దిగబడితే, నలుగురైదుగురు మనుషులు గింజుకొని, ఎడ్లని అదిలించి.. బండి కదపలేక పోయేరట. తన తాత భుజాన్ని బండి పల్రాం కొమ్ముకి మోపుజేసి. ఎడ్లని అదిలించి బండి తోసేడట. అంత బురదల దిగబడిన బండీ తేలిగ్గా వొడ్డెక్కిందట.

నాయుడోరు - తన తాతని వొదిలీవోరు కాదట. కంబారి అని పేరే గాని అన్నీ తన తాత సేతుల మీదే నాయుడోరి పంట యెత్తీ దించీవోడట !

అప్పటిరోజుల్ల -యిప్పుడ్లాగ బస్సు రోడ్లూ ,బస్సులూలేవట. ఎడ్ల బళ్ళప్రయాణమట. ఎర్రగొల్లల భయం వుండేదట. దోవల - బళ్ళు అడ్డగించి, దోచుకొనేవోరట.

ఒకసారి, నాయురాళ్ళమ్మలు పెళ్లి ప్రయాణం యెల్తం(డట. తన తాత .. బండి తోల్తండట. ఎర్రగొల్లలు దోవగాసేరట. నాయురాళ్ళమ్మ గుండెలు కొట్టుకున్నాయట. ఆదియ్యా - నీదే భారం అన్నారట.

తన తాత, ఎడ్లబండి మొకరా దిగకుండానే ఎర్రగొల్లల్తోటి కొట్లాడినాడట. భారతంలో క్రిష్ణుడు రధం నడిపితే అర్జునుడు యుద్ధం జేశాడు గానీ, వొక సేత్తోటి బండి నడిపి, మరో సేత్తో బాణాకర్ర సాము దిప్పి సేమంగా నాయురాళ్ళని ఇంటికి సేర్చాడట. అదిగప్పుడు నాయుడోరు మెచ్చుకొని చెరువుదిగువ పోలాన మడిసెక్క యినామిచ్చారు. ఆ మడి సెక్కని యిప్పుడికీ "ఎర్రగొల్లల సెక్క" అనే పిలుస్తారు.

ఇపుడా మడిసెక్కా లేదు, తాతాలేడు. తన తాతలూ నేతులు తాగేరు. ఆదెయ్య దీర్ఘంగా నిట్టూర్చి

" అడుక్కున్నోడి లాగా - యేటి, అడుక్కున్నోడినే" అన్నాడు.

ఆ మాటను పోతి నాయుడు వొప్పుకోలేదు.

" నీకేటిరా ? నీ తాత్తండ్రులు ఊరిబారికోళ్ళు, గాన్నువ్వో? గవర్నమెంటు బారికోడివి. నిన్ను సూస్తే.. గవర్మెంటుని సూసినట్టే. నువ్వు కేకేస్తే .. గవర్మెంటు కేకేసినట్టగే." తన ధోరణిలో జవాబు చెప్తున్నాడు.

".. ఆడు అడుక్కుంటే - గవర్మెంటు అడుక్కునట్టేనేటి? మరెవులు దొరకలేదా యిగటాలకి. " చేతిలో అన్నం ముద్దతో వొచ్చింది, పోతినాయుడి భార్య వరాలమ్మ.

"యిగటమంతాది ? ఆడేటీ నా యీరకాడా (వీరకాడు) యిగట మాడ్డానికి ? నిజిమాడతన్ను. గవర్మెంటుఅడుక్కుంటాదేటి?గద్దించి గుద్దుతాది పన్నులు.గవరమెంటుబారికోడూ అలాగే వుండాల" .

"యిదరా బారికోడా, తపేలా పట్టు. ఇతగాన్తోటేటి ? నువ్వితగాని కవుర్లు యినుకోని వుండిపోతే, అవతల అందరూ గిన్నెలు కడిగీగ(లు." అని హెచ్చరించి, బారికోడి తపేళాలో అన్నం వేసింది వరాలమ్మ.

ఆదెయ్య నవ్వుకుంటూ,'వొస్తానమ్మా' అని నడవబోతే -

"ఉండుం(డా, కసింత కూరరవ్వ వుండిపోనాది. కోడలు తినలేదు. ఆయమ్మకి రుచులు సాల్లేదట. తెస్తానుండు." అని ఇంట్లోకి వెళ్లింది వరాలమ్మ.

"రుచీ, పచీ అక్కర్లేదుర దీనికి. కోడలు పిల్ల యెలగొప్పుకుంతాది? నాలిక మీద యెంట్రుకలు మొలిస్నాయి.. నాయురాలమ్మ వంట తిని నాకు. సేనిదాకల .. నూనెయ్యికుండా యేపితే రుచెక్కడొస్తాది ? " ఇంట్లోకి వినబడకుండా గబగబా, మాట్లాడబోయేడు పోతినాయుడు. గానీ, ఆఖరిమాట వినే వినేసింది వరాలమ్మ.

"సేనిదాకల - నూని యెయ్యిడంకి. వుండొద్దా రూపాయలు ? రైతోడు నూనెసుక్కలు కొనుక్కోడం యెరుగుదుమా ? పప్పుదినుసుకీ .. పరిగెట్టాల కోమటి దుకానంకి. ఏకంగా, భూమంతా .. జనువులు జల్లీసినారు. జనపనార పండించి, అమ్మితే .. అంతలేసి నోట్లు కట్టలొస్తాయని. ఆ నోట్ల కట్టలూలేవు.

ఇంటిల నూనెసుక్కా, పప్పు బద్దా .. కరువు. కరువు కాలిపోతే.. రుచులు కావాలట, రుచులు." రుసరుస లాడింది వరాలమ్మ. వ్యాపార పంటల వల్ల రైతు వంటింట్లో వచ్చిన అవస్థలు కన్పించాయామెలో.

"మీ యమ్మకి వొంటిల బాగోలేదట ? ఎలగుందిరా యిప్పుడు ? నీ పెళ్ళం మతి స్థిరం కాలేదు గావాల పాపం. మా సెడ్డ యిక్కట్లొచ్చేయిరా నీకు" వరాలమ్మ విచారం వ్యక్తం చేసింది.

ఆదెయ్య తల్లికి నిన్నటి నుంచీ జ్వరమూ, గుండెల్లో ఆయాసం. తల్లి జ్ఞాపకం రాగానే, గబగబా ఊరు దిరగడం ముగించి, ఇంటికి వెళ్ళి పోవాలను కున్నాడు ఆదెయ్య. అక్కడి నుంచి కదిలేడు.

"అమ్మా., బారికోడ్ని"

"తెళ్ళవుతున్నాయిరా ?"

"అమ్మా"

"... కలిబోస్సేమురా"

ఆదెయ్య గడప గడపా దాటి, కాపువీధి కొసకొచ్చేడు. కరెంట్ వచ్చింది. వీధిలో వెలుగు పరుచుకుంది. వీధి ఆ కొసలో యెవరో పిల్లాడు "కరెంటొచ్చిందో,కరెంటో .. టీవీ యేస్తారో " .అని కేకేస్తూ పరుగెత్తుతున్నాడు. ఆ కేకకు, ఇళ్ళల్లోని మరి కొందరు పిల్లలు "వొచ్చేయ్..." అని కేకేస్తూ, టీవీ దగ్గరకుపరుగెత్తారు. ఆ గ్రామ పంచాయతీకి టీవీ, రేడియో రెండూ వున్నాయి.

కొసాయింటి గడపలో నిల్చున్న బారికోడు "అమ్మా" అని కేక వెయ్యకముందే ఆ ఇంట్లోంచి అమ్మో అన్న కేక, ఆ తర్వాత జుత్తు చెదిరి పోయి యేడుస్తూ తవిటమ్మ వొచ్చింది.

" యెటే ? యెటెల్తావే " ఆమెను వెంబడిస్తూ,ఆమె భర్త సీతయ్య

తవిటమ్మ బారికోడి వెనక నిల్చుంది.

బారికోడు దుడ్డుకర్రతో సీతయ్యను అడ్డగించి-

" ఒసే, సాల్లేవోయ్.. సంపేస్తావేటి ఆడకూతుర్ని?" గదిమాడు.

"లేపోతే సూసుకోలేదట! ఏడంతస్థుల మేడల వున్నాదా ? ఏ గదిల యేది దూరుతాదో సూసుకోక పోవడానికి ?" సీతయ్య

"అయితేటి సూసి వొదిలీసి నానేటి?" యేడుస్తూనే తవిటమ్మ.

"అదరమళ్ళా చేసిన తప్పు చేసేస్తాది. వొప్పుకోకుండా వోదిస్తాది.మూతిరగబొడిసీయాలే నీకు" . కలబడబోయేడు సీతయ్య.

అప్పటికి పోతినాయుడు, ఇరుగూ పొరుగూ చేరుకున్నారు.

"యేట్రా గొల్లు?" అడిగాడు పోతినాయుడు

"బేపులు (కుక్కలు) ఇంట్లొగ్గేసి, ఈదిల పెద్దరికంకి యెళ్ళింది నాయిరాలు " కోపంగా చెప్పాడు సీతయ్య

"నీనే ఈధులు తిరిగేను.. ? ఎవులన్నారు.. "

"ఈదిల పెద్దరికంకి గాపోతే టీవీ కాడకి సిన్మాకెల్లినావే ?"

"అదా ,అన్నీ అలాపింటి మాటలే. కరంటున్నాదేటి..టీవీ సూడ్డంకి. ఇపుడు గదా,కరంటొచ్చింది."
దూరంగా భర్తకు అందకుండానే సమాధానాలిస్తోంది తవిటమ్మ.

"అయితేటి, వొన్నంగట్రా తినీసాయేటే బేపులు ?" పొరుగింటామె అడిగింది.

"అబ్బే, అన్నం, పులుసూ.. తపేళాల్ల అలగే ఉన్నాయి.ఆట్ని ముట్టలేదు. ముండ్రాల బేపులు..'

"మరేటి,. కూర తినేసినాయే ?" అడిగాడు పోతినాయుడు.

"ఏం కూరనుకున్నావు? పూరిడుపిట్ట మాంసం" ఉసూరుమంటూ చెప్పాడు సీతయ్య.

"పూరిడుపిట్ట యెక్కడిదిరా ?" ఆరాలు అడిగేడు పోతినాయుడు

తవిటమ్మకు యేడుపంతా యెగిరిపోయింది. కిసుక్కున నవ్వింది. అంతా ఆశ్చర్యంగా చూసేరామెను.

నిన్న సాయంత్రం పెద మెరక పొలం నుండొస్తుంటే, తుమ్మిక డొంకల్లోన రెండు పూరిడుపిట్టలు అగుపించాయట. అడుగులోన అడుగేసుకుంటూ, మెల్లిగా డొంక దగ్గరికి చేరి, పిట్టల్ని పట్టబోతే, ఒకటి యెగిరిపోయి మరొకటి చిక్కిందట సీతయ్యకు. పిట్ట యింకా .. నాల్రోజులాగితే . కూరకి బాగుంటాదని జాగ్రత్తగా యింటిలో గూడుకట్టి పెట్టేడట. కాని యింటిల కుక్కలూ, కోళ్లూ.. బెడదవల్ల.. యీ రోజు పిట్టని తన చేతిలోనే వుంచుకొని తిప్పేడట. సాయంత్రం.. కడుపు పొడిస్తే చెరువుకి వెల్లాడట. చేతిలో పిట్టని పట్టుకొని .. విరోచనంకి కూర్చున్నాడట. విరోచనం .. మందగించి.. కడుపు బిగించి, గట్టిగా ముక్కిలి మూలిగేడట. పిడికిటి బిగుసుకుందట. విరోచనమయ్యేసరికి పిడికిటిలో పిట్ట చచ్చి ఊరుకుందట.

నవ్వు ఆపుకోలేక, ఆగి,ఆగి పూరిడు పిట్ట కూర కథ చెప్పింది తవిటమ్మ. విన్నవాళ్ళంతా గొల్లున నవ్వేరు.

సీతయ్య విసురుగా యింట్లోకి వెల్లి, అన్నం - తపేళాతో తీసుకువచ్చి - బారికోడి తపేళాలో వేశాడు. తపేళా కింద పారేసి అక్కడ్నించి వీధిలోకి వెల్లిపోయాడు.

బారికోడు ఆశ్చర్యపోతూ నిలబడిపోయేడు. మరొకరి ఆహారాన్నినింపుకున్న నేరస్తుడిలా తలదించుకున్నాడు.అది గమనించి, పోతినాయుడు-

".. ఏటాలోసిస్తావు బారికోడా .. ప్రాప్తం! బియ్యపు గింజ మీద యెవులికి ప్రాప్తమో .. రాసేసి వుంతాదట. తీసికెళ్లు .. యింటికాడ తల్లికి బాగులేదంతన్నావు.. బేగెల్లు .." అన్నాడు.

బారికోడు మౌనంగా మరి యే గడపకూ వెళ్లకుండా యింటి వైపు నడిచాడు. ఊరి బయట తమ వాడకు పోయే మలుపు దగ్గర వి.ఏ.వో. సూరిబాబు యెదురయ్యి-

"..రేపు తెల్లారి వేగం రారా .. ఇరసాలు డబ్బు తీసుకెళ్లి ట్రజరీల కట్టాల నువ్వు .." అని చెప్పాడు.
ఆదియ్య మౌనంగా దుడ్డుగర్రను నేలను రాస్తూ నిల్చున్నాడు.

"..... అనువులనవ్వా, మినువులనవ్వా యేమిరా ? గదమాయించాడువి.ఏ.వో.

".... ధర్నా సేస్తన్నాం గదా బాబ్.." నసిగేడు ఆదెయ్య

" .... అయితే?"

" స్ట్రయికన్నాళ్లూ... పన్లు సెయ్యిగూడదని.." ఆదెయ్య మాట పూర్తి కాకుండానే అందుకున్నాడు వి.ఏ.వో.

"... మరి స్ట్రయికన్నాళ్లూ.. ఊరి మీద తాపేళా పట్టుకు దండుకోవచ్చా? పని చెయ్యడానికయితే స్ట్రయికూ, పడీసుకోడానికయితే లేదా ? " నిష్టురమాడేడు.

"...మీము పనెంత జేస్తన్నామో, పడీసుకు తినీదెంతో.. తమకి తెలీదా ? నలుగుర్తోటి యవ్వారం నావొక్కడిదయితే తమరి మాట కాదంతానా ?యెపుడేనా కాదన్నానా ? " వినయంగా ఆదెయ్య.

".....అయితిపుడు నాయుడివీ. బారికోడివీ.. రెండూ నువ్వేనన్నమాట ?" హాస్యమాడేడు, అటుగా వచ్చిన సర్పంచ్.

వి.ఏ.వో. ఆ హాస్యాన్ని పట్టించుకోలేదు.

"ట్రెజరీ పనులో, ఎమ్మార్వో ఆఫీసు పనులో అయితే, పోనీ యెలాగో నెట్టుకొస్తాను. ఏదేనా చాటింపు వెయ్యాలంటే యెలాగరా?" ఆక్రోశంగా ఆడిగేడు వి.ఏ.వో.

కొన్ని వృత్తులు, కొన్ని కులాలవారే చెయ్యాలన్న భావజాలంలోంచి వచ్చిన ప్రశ్న అది.

"... నీ డప్పు హేండోవర్ చేసీరా బారికోడా స్ట్రయిక్ పీరీడన్నాళ్లూ.. " సర్పంచ్, మళ్లీ శృతిమించి హాస్యమాడేడు.

అయినా వి.ఏ.వో. ఉక్రోషంగా చూశాడే తప్ప, యేమీ బదులివ్వలేదు. సర్పంచ్‌కి భూమీ, పుట్రా బాగావున్నాయి. బి.ఎల్. చేశాడు. వకీలు వృత్తిలో రాణించాలన్నా... రాజకీయాలు అవసరమని గ్రహించాడు. సర్పంచ్ గిరీ నుంచి.. రాజకీయ యాత్ర ఆరంభించాడు. రాష్ట్రస్థాయి నాయకుల్తో సత్సంబంధాలున్నాయి.

వి.ఏ.వో.కి యివేవీ లేవు. కరణీకం జేసిన తండ్రి ద్వారా వి.ఏ.వో. నౌకరీ లభించింది. నాయకుల్తో పేచీలకు దిగటం.... నౌకరీకి నష్టమని భయం.

ఈ సంభాషణంతా, యెదుటి వరండాలోంచి వింటోన్న రాజు మేష్టారు రంగంలోకి దిగేరు. ఆయనకు నౌకరీకి నష్టమనే భయాల్లేవు. మండలస్థాయి ఫెడరేషన్ నాయకుడాయన.

"... డప్పు పట్టుకు చాటింపయినా, చీపురు పట్టి మాదిగ వీధి తుడవాలన్నా - ఉర్యోగులేం పనికొస్తారు - మీ రాజకీయనాయకుల దగ్గర? వి.ఏ.వో. డప్పు పట్టుకుంటే యేమొస్తాది ? మీరు పట్టుకుంటే - మాదిగల ఓట్లొస్తాయి.." అని దెబ్బగొట్టేడు రాజు మేస్టారు.

".. యేది మాట్లాడినా, రాజకీయం చేస్తావయ్యా రాజు మేస్టూ.." ఉడుకుమోత్తనంతో సర్పంచ్.

"... అన్నీ రాజకీయమే, కానిదేది ? ఈనాడు తలారీల సమ్మెకి మద్దతు మీరు ప్రకటించారంటే అది రాజకీయం కాదా ?" మాస్టారు - సర్పంచ్‌ని యెండగట్టే తీరులో అడిగాడు.

"...ప్రతిపక్షంలో వున్నారు గనక మద్దతన్నారు.అధికారపక్షంలో వుంటే - ఆ మాట అనగలరా? ఇన్నాళ్లూ.. తలారీల సమస్యలు మీకు తెలీదా? వారికోసం యింతదాకా మీరు చేసిన సంస్కరణేమిటి?"

మాస్టారు ఆగటంలేదు. బారికోడికి ... యీ ప్రశ్నలన్నీ బాగానే అనిపిస్తున్నాయి. గానీ - యిది... యెక్కడిదాకా పోతుందోనన్న భయం...

"... నువ్వు పాఠాలకంటా, రాజకీయాలు యెక్కువ చెప్తావయ్యా..." వొక్క ముక్కతో, రాజు మేస్టారి కంఠశోషని దులపరించుకు వెళ్లిపోయేడు సర్పంచ్. వి.ఏ.వో అంతకుముందే వెళ్లిపోయుడు.

" మీరు ఆందోళనను తీవ్రతరం చెయ్యాలయ్యా " ఆదెయ్యకు చెప్పారు మాస్టారు.

ఆదెయ్యకేమీ పాలుబోలేదు. అసలు, మొదటిరోజున శిబిరంలో ధర్నాకి కూర్చోమన్నపుడైతే.. చాలా బిడియపడ్డాడు. కల్లుదాగి - గొల్లు జెయ్యడమేగానీ, శిబిరాలు, ధర్నాలూ వీళ్లకేం తెలుసు - అని కొందరు హేళన కూడా చేశారు.

బిడియం పోయి, కూర్చున్న ఆదెయ్య - ఆరోజు యెవరో ధర్నా శిబిరం ఆరంభిస్తూ.. తమ సమస్యల గురించి ఉపన్యసిస్తుంటే.. తన గాయాల్ని తను అప్పుడే గ్రహించినట్టుగా - విన్నాడు.

గ్రామసేవకులని గొప్పగా నామకరణం చేసేరు గానీ.. మనం యెవరి సేవకులం ? అధికార్ల, కామందుల, నాయకుల .. సేవకులం. గ్రామానికి చేసే సేవ యేదీ ?

వెట్టి చాకిరీ రద్దుగావాలి. తాతల్నాటి వేతనాల్ని సవరించాలి. పని భారం తగ్గించాలి. పని గంటలు నిర్ణయించాలి.

"..వృత్తిరీత్యా మాత్రమేగాదు... కులరీత్యా కూడా మీరు ఆందోళనని తీవ్రం చెయ్యాలి.."

మాస్టారికేవో ఆలోచనలున్నాయి. ఆదెయ్యకు అవి అందటంలేదు. బరువెక్కిన తపేళాతో, యింటికి నడిచేడు మాస్టారి వద్ద సెలవు తీసుకొని,.

ఇల్లు చేరేసరికి - యేడుస్తోన్న మనవరాళ్లు,వార్ని ఊరడిస్తుందో, బెదిరిస్తుందో అర్థంగాని.. చేష్టల్తో మతిస్థిమితం లేని భార్య. మంచమ్మీద రోగంతో తల్లి..!

ఇదిగిదే .. సంసార సాగరం. ఇది ఈదటానికే యీ బారికోడికి యిన్ని యాతనలా ? ఆదెయ్య.. అన్నం తపేళా దించి, మనవరాళ్లను పిలిచాడు. ఆదెయ్య భార్య - అన్నం గిన్నెలో రెండు చేతులూ పెట్టి.. అన్నం వేయబోయింది. ఆదెయ్య కోపంతో .. తల మీద మొట్టాడు. ఆమె ఆ దెబ్బకే.. తలపట్టుకు ... గోడవారకు చేరి యేడుపెత్తుకుంది.

ఆమెకు .. తల మీద దెబ్బలు యెన్ని తగిలేయి.. !

పెద్ద కూతురు బతుకు చిందరవందరయి, ఆమె దూరమయినపుడే.. బాగా కృంగిపోయింది. ఆ తరవాత, రెండవ కూతుర్ని మాత్రం.. కన్నవారింటికే యిచ్చింది. కట్న కానుకల కింద.. ఎర్రగొల్లల మడిసెక్క చెల్లు జేసింది. సారె, చీరలు పెట్టింది. రాక, పోకలు సాగించింది. ఆమెలో మళ్లీ పూర్వపు చలాకీతనం కలిగింది. కూలికీ, నాలికీ వెళ్తూ, బారికోడికి వేడినీళ్లకు చన్నీళ్లు అయ్యింది.

అది, యెంతకాలమో సాగలేదు. నిండు చూలాలుగా యింటికి వొచ్చిన చిన్న కూతురు.. కవలపిల్లల్ని కనలేక కనీ.. కళ్లు మూసింది. అదిగో, అప్పుడు .. ఆదెయ్య భార్య పిచ్చిదయిపోయింది. కూతురు ప్రసవించిన కవల పిల్లలు.. తన యిద్దరు కూతుళ్లంటుంది. వాళ్లను యెత్తుకుంటుంది. తన రొమ్ములకు చేర్చి, పాలు దాగమంటుంది. వాళ్లు.. పాలురాని రొమ్ముల్ని కరిచి యేడుస్తుంటే.. తనూ యేడుస్తుంది...!

గోడవారకి చేరి యేడుస్తోన్న భార్య దగ్గరకు ఆదెయ్య వెళ్లాడు. ఆమె గడ్డాన్ని పట్టుకొని అనునయించాడు. తీసుకొచ్చిన అన్నం ముద్దలు తినిపించేడు. తన కన్నీటిని మింగి.. యే ఝాముకో నిద్రబోయుడు.

మర్నాడు ఎమ్మార్వో కార్యాలయం ముందటి - తురాయి చెట్టు కింద - ధర్నా శిబిరంలో కూర్చున్నాడు ఆదెయ్య. ఆ మండలంలోని తలారీలు మరో పదిహేను మందిదాకా .. శిబిరంలో కూర్చున్నారు.

"... జీతాలు పెంచటం కొప్పుకోరట.."

".. ధర్నా యిరమించుకుంతే, మిగిలిన డిమేండ్లు ఆలోసిస్తారట.."

"దిగినోలిమి, పూర్తిగా తాడోపేడో తేలిందాక యిరమించొద్దు"

"ఈ రోజు సాయంత్రంకి తేలప్పోతే రేపు రాస్తారోకో వుందట" యిలా, తలా ఒకరకంగా, కూర్చున్నవాళ్లు మాట్లాడుకుంటున్నారు.

"..ఏ విషయమూ సాయంత్రానికి తేల్తాది..."

మండల స్థాయి తలారీల నాయకుడు ప్రకటన.

ఆదెయ్య కు.. యీ మాటలొక పక్క, మరోపక్క తల్లి అనారోగ్యం... డాక్టరు మాటలు.. యింకోపక్క రాజు మేస్టారి మాటలూ.. అన్నీ కలగాపులగంగా.. చెవుల్లో గింగురు మంటున్నాయి.

"అశ్రద్ధ జేస్పారు. టైఫాయిడ్ ముదిరిపోయింది. మరోపక్క బి.పి . వొచ్చింది. ఇరవయి నాలుగ్గంటలు దాటితేగాని.. నమ్మకం చెప్పలేను.." రాత్రి వేకువజామున, యింజక్షనిచ్చి బసవలింగం డాక్టరుగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చేయి. అపస్మారకంగా అలా.. చావుబతుకుల మంచం మీదనున్న తల్లి గుర్తొచ్చింది.

మతిలేని తన భార్యనూ, పసికందులు మనవరాళ్లనూ.. సంరక్షణ చేసుకుని, తనను కని పెట్టుకు వచ్చిన తల్లి .. మనసులో కదిలేక విలవిల లాడిపోయేడు.

శిబిరంలోని, సాటి మిత్రులకు పరిస్థితిని వివరించి అక్కడ నుంచి - యింటికి నడిచేడు ఆదెయ్య.

ఆదెయ్య శిబిరం నుంచి ఊరు చేరేసరికి సాయంత్రమవుతోంది. మేతకు వెళ్లిన పశువులు తిరిగొస్తున్నాయి. పడమటి కొండల్లో పొద్దు ఆఖరి చూపులో వుంది.

ఇంటివైపు నడుస్తుంటే, మంగలి లక్ష్మీజీ యెదురొచ్చి-

".. బావొరే, ఆదెయ్య, విఏ.వో. బావు నలమాటు పంపేడ్రా నీకోసం, ఇంటికాడలేడు బావూ అనంటే యినడు" చెప్పాడు.

".. యితగాడొకటి.. మొగుడొదిల్నా .. హూఁ.. ఎందుకటా? " అడిగాడు ఆదెయ్య

చెప్పాడు లక్ష్మీజీ !

ఆదెయ్య గుండెలో రాయిపడింది. శిబిరం నుంచి తల్లి కోసం వొచ్చేస్తే .. యిపుడీ గండమా? లక్ష్మీజీకి తల్లి పరిస్థితి చెప్పాడు.

"..పోనీ, ఆ ముక్క, ఆ బాబుకే చెప్పి వొచ్చీరా. ఈలోపు యింకెవుల్నో పురమాయించమందువు" లక్ష్మీజీ.

అయిష్టంగానే లక్ష్మీజీతో కదిలేడు ఆదెయ్య.

ఊరిని ఆనించిన సంతతోట. అక్కడో అనాథ శవం, యేతల్లి పేగు తెంపుకు పుట్టినవాడో తెగిన పీకతో నెత్తురు మడుగులో వున్నాడు. వి.ఏ.వో, సర్పంచూ, కొందరు జనాలూ వున్నారు.

ఆదెయ్య చేరగానే -

"..హమ్మయ్య వొచ్చేవా ? మధ్యాహ్నం నుంచీ నీకోసం కబురు మీద కబురు పెట్టేను. ఈ లోపు, యిదిగో పోలీసు స్టేషన్‌కి రిపోర్టు పంపించేను. మంగలి లక్ష్మోజీని యిప్పుడిదాకా .. తిప్పేను. రక్షించావు, నువ్వొచ్చేవు. పొద్దుబోతోంది. నువ్విక్కడుండు, మళ్లా పోలీసులుకి మరో కబురుచేసి, రప్పిస్తాను యిదిగో, యిప్పుడే " అంటూ, అప్పగింతలు చేశాడు వి.ఏ.వో.

"...వొక్కడూ సంత తోటల వుండడంకి. ఆడేటి వీరబాహుడా? హరిశ్చంద్రుడా? కల్లు సుక్కలకి డబ్బులిస్తే సుక్కేస్సి, కాటిసీను పద్యాలేనా పాడుకుంటాడు. డబ్బులియ్యవయ్యా... వి.ఏ.వొ..." సర్పంచ్, హాస్యంగా అందర్నీ నవ్వించేనన్నట్టుగా ఫీలయి, అక్కడ్నించి కదిలేడు.

ఆదెయ్య మనసులోని మాట బయటికి రానేలేదు. అందరూ తోట ఖాళీ జేస్సారు. మంగలి లక్ష్మోజీ, సానుభూతితో చూస్తూ-

"...నీనెల్తానులే మీ యింటికి. మీ యమ్మని చూస్తానులే.." అని చెప్పి వెళ్లాడు.

మెల్ల మెల్లగా చీకటి నిండుకుంటున్న ఆ సంత తోటలో... అనాథ శవానికి కాపలాగా మరో బతికున్న శవం - బారికోడు ఆకులు రాలిపోయి, యెండిన మోడులా నిల్చున్నాడు.

*(సుప్రభాతం 5 . 3 . 97)*

★ ★ ★